సాక్షి తిరుపతి

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



నెమలి పింఛం..గణనాథం!

రాష్ట్రంలోనే అతిపెద్ద నెమలి పింఛాల వినాయకుడు తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో కొలువుదీరాడు. - 8లో



టీడీపీకి భంగపాటు తప్పదు

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి భంగపాటు తప్పదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	25
చిత్తూరు	34	24
తిరుమల	29	21
గూడూరు	37	27
నగరి	35	25

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 62,745 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,451 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.10 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు శ్రీకాళహస్తిలో 'జగనన్నకు చెబుదాం'

తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు, శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయవచ్చని సూచించారు.

ప్రయాణికులకు నూతన వస్త్రాలు



ప్రయాణికులకు చీర, పంచెను అందిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున ముందుగా బస్సు ఎక్కిన ప్రయాణికుల దంపతులకు చీర, పంచెను ఆర్టీసీ అధికారులు పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి వస్తున్న సంప్రదాయాన్ని యథావిధిగా పాటించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి సౌజన్యంతో దుస్తులను అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డితోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా నూతనంగా ఆధార్ కార్డు నమోదు, 5–15 సంవత్సరాలు దాటిన బాలబాలికలకు బయోమెట్రిక్ అప్డేట్ సేవలు పూర్తి ఉచితంగా పొందవచ్చన్నారు. ఆధార్ కార్డ్ ప్రింట్ కోసం రూ.30, ఇంటి చిరునామా మార్పు కోసం రూ.50, ఇంటి చిరునామాతో పాటు బయోమెట్రిక్ అప్డేట్ కోసం రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నవోదయలో 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయలో 2024 –2025 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో 10 ఫిబ్రవరి 2024న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ ప్రవేశ పరీక్షకు 2023–2024 విద్యా సంవత్సరంలో ఏదైన ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో రెండున్నర గంటల సమయంలో రాత పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ 31 అక్టోబర్ 2023 అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఫార్మసీ రంగంలో నానో టెక్నాలజీ కీలకం



వీసీని సత్కరిస్తున్న నిరంజన్‌బాబు

రామచంద్రాపురం: ఫార్మసీ రంగంలో నానో టెక్నాలజీ కీలకమని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ రంగ జనార్దన తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్రామాపురం వద్ద సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో రీసెంట్ అడ్వాన్సెస్, ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ నానో టెక్నాలజీ రీసెర్చ్ టు రెవెన్యూ అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వీసీ మాట్లాడుతూ నానో టెక్నాలజీని దెబ్బతిన్న కణజాలాల వృద్ధి కారకాలు, కణజాల మరమ్మతు, పునరుత్పత్తికి ఉపయోగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు, మదర్ థెరిస్సా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్, శ్రీ పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ రంగనాయకులు, సెవెన్ హిల్స్ కళాశాల కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.



పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడు

హంస వాహనంపై విద్యాప్రదాయిని (ఇన్‌సెట్) స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ఆధ్యాత్మిక వారధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటన ఆద్యంతం అభివృద్ధి.. ఆధ్యాత్మికం తొణికిసలాడింది. సనాతన సంప్రదాయాన్ని కొనసాగించడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గత ప్రభుత్వం పునాది దశలో వదిలేసిన శ్రీనివాస సేతు వంతెన ప్రారంభం నగర వాసుల్లో ఆనందం నింపింది. ఏళ్లుగా మరుగునపడ్డ టీటీడీ ఉద్యోగుల కల సాకారం కావడం తండ్రిని మించిన తనయుడు అనిపించింది. ఆధునిక సొబగులతో తీర్చిదిద్దిన వసతి సముదాయం ప్రారంభంతో జై జగన్ నినాదాలు విద్యార్థి లోకం మిన్నంటించింది. ఆపై శ్రీవారి సోదరి తాతయ్యగుంట గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మొదటిసారి పట్టువస్త్రాలు సమర్పించడం ప్రాచీన సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చింది. తదనంతరం తిరుమలేశుడి బ్రహ్మోత్సవ వేళ ఆ కలియుగ వైకుంఠవాసుడి దర్శనార్థం తిరుమల చేరుకోవడం.. అక్కడ పలు ప్రారంభోత్సవాల అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం పలువురిని ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తింది.

- తిరుపతి, తిరుమలలో పలు ప్రారంభోత్సవాల్లో సీఎం వైఎస్.జగన్
- తిరుపతి తాతయ్యగుంట, తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ
- సనాతన సంప్రదాయం కొనసాగింపు

తిరుమల/తిరుపతి తుడా/తిరుపతి సిటీ/ తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమ, మంగళవారం రెండు రోజుల పర్యటన ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సాగింది. మొదట సీఎం వైఎస్.జగన్ రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డుమార్గన తిరుపతి మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అక్కడ రూ.650.50 కోట్లతో 7 కి.మీ పొడవు నిర్మించిన ఆకాశవీధి- శ్రీనివాస సేతు వంతెనను ప్రారంభించారు. విద్యార్థుల కోసం రూ.37.8 కోట్లతో నిర్మించిన శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నూతన వసతి సముదాయాన్ని ప్రారంభించారు. తర్వాత సుమారు ఏడు వేల మంది టీటీడీ ఉద్యోగుల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల కోసం సుమారు రూ.600 కోట్లు ఖర్చుచేస్తున్నారు.



శ్రీవారి ఆలయంలో టీటీడీ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్.జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ప్రాతఃకాల దర్శనం

మంగళవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతఃకాల సమయంలో తిరుమల శ్రీవారిని మరోమారు దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. సీఎంకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వేద పండితులు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. రెండు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటు స్థానికులు, అటు భక్తులను పేరుపేరునా పలకరిస్తూ ఆకట్టుకున్నారు.

గంగమ్మ తల్లికి ప్రభుత్వ సారె

మార్కెట్ యార్డు నుంచి ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన తిరుమల చేరుకున్నారు. దాతల సాహకారంతో టీటీడీ నిర్మించిన వకుళమాత, రచన అతిథి గృహాలను ప్రారంభించారు. అనంతరం బేడి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు పరివట్టం చుట్టారు. పట్టువస్త్రాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా తిరుమల శ్రీవారికి సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.



గంగమ్మకు సారె తీసుకెళ్తున్న సీఎం వైఎస్.జగన్



ఆధ్యాత్మిక తన్మయత్వంలో ముఖ్యమంత్రి



రామసేతు వంతెన ప్రారంభంలో సీఎం వైఎస్.జగన్, మంత్రులు



సీఎం వైఎస్.జగన్‌తో డెప్యూటీ మేయర్, తుడా చైర్మన్



ధ్వజారోహణం



చిన్నశేష వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన

పాతికేళ్ల కల సాకారం

కరుణన్న కృషి.. సీఎం జగనన్న సహకారం

- టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ
- మరణించిన వారికి, రిటైర్డ్ అయిన వారి కుటుంబ సభ్యులకు కూడా..
- సీఎం ప్రకటనతో హర్షం వ్యక్తం చేసిన టీటీడీ ఉద్యోగ సంఘాలు



- నా పేరు చీర్ల కిరణ్‌కుమార్. టీటీడీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నాను. ఇళ్ల స్థలాల కోసం పాతికేళ్లుగా పోరాడాము. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారం.. టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి కృషితో ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కార లభించింది. ఇంటి పట్టాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. రిటైర్డ్ ఉద్యోగులు, మరణించిన వారి కుటుంబ సభ్యులకు కూడా ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించడం సంతోషం కలిగించింది.



- నేను టీటీడీ ఉద్యోగిని. నాపేరు రామాంజులమ్మ. కళ్లు సక్రమంగా కనిపించవు. నా కుమార్తె సహకారంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటి పట్టా అందుకోవడం..నా జీవితంలో మరిచిపోలేని సంఘటన. సొంతింటి కల నేరవేరినందుకు ఆనందంగా ఉంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సహకారం మరువలేను. భూమన అన్నకు కృతజ్ఞతలు.



- నాపేరు ఏకే. నరసింహాచార్యులు. 48 ఏళ్లుగా టీటీడీలో అర్చకుడిగా పనిచేస్తున్నాను. 2007లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తలపెట్టారు. ఆ తర్వాత ఈ విషయాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. నేడు ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాకు సొంతింటి కల నెరవేర్చారు. దీని వెనుక టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కృషి ఉంది. ఆజన్మాంతం వారికి రుణపడి ఉంటాను.

సాక్షి, తిరుపతి: పాతికేళ్ల నిరీక్షణకు తెరపడింది. టీటీడీ ఉద్యోగుల మోములో ఆనందం వెల్లివిరిసింది. సోమవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కృషితో టీటీడీలో పనిచేస్తున్న 3,518 మంది ఉద్యోగులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల తోపాటు గతంలో ఉద్యోగ విరమణ పొందిన వారు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కూడా ఇళ్లస్థలాలు పంపిణీ చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తండ్రి అడుగు జాడల్లో తనయుడు

టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమం 1978లోనే నిలిచిపోయింది. ఆ తర్వాత ఎవ్వరూ పట్టించుకోలేదు. 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్.రాజశేఖరరెడ్డి, నాటి పాలక మండలి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సహకారంతో మళ్లీ ఈ కార్యక్రమం పట్టాలెక్కింది. 2007లో 2,500 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించగా.. దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఆ తర్వాత వైఎస్సార్ మరణించడంతో ఈ కార్యక్రమం మూలన పడింది. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక మళ్లీ టీటీడీ ఉద్యోగుల కల సాకారమైంది.



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న టీటీడీ ఉద్యోగిని

వడమాలపేట సమీపంలోని జాతీయ రహదారి పక్కనే అత్యంత విలువైన భూమిని టీటీడీ ఉద్యోగులకు కేటాయించారు.

వైఎస్ కుటుంబంతోనే సాకారం

తిరుపతి సిటీ : వైఎస్ కుటుంబంతోనే టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారమైందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి సమీపంలోని మార్కెట్ యార్డ్ వద్ద స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. అనంతరం టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోనే టీటీడీ ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. సీఎం ఆదేశాలతో సుమారు రూ.313 కోట్లు వెచ్చించి 3,518 మంది ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. అలాగే మరో 250 ఎకరాల మంజూరుకు సీఎం ఆమోదం తెలిపారని, దీంతో మరో 3,500 మందికి కూడా ఇంటి స్థలాలు వస్తాయని చెప్పారు. పునాది దశలో ఉన్న శ్రీనివాససేతును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేయించడంలో సీఎం సహకారం మరువలేమన్నారు. అలాగే తిరుపతి నగరంలో రోడ్ల అభివృద్ధి, సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల కేటాయింపు విషయంలోనూ జగనన్న వెన్నంటి ఉంటూ సహకారం అందించారని తెలిపారు.

వైఎస్ కుటుంబంతో మూడు తరాల అనుబంధం

వైఎస్ కుటుంబంతో తనకు మూడు తరాల అనుబంధం ఉందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గుర్తుచేసుకున్నారు. వైఎస్.రాజారెడ్డి శిష్యుడైన తాను ఆ తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వద్ద, ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వద్ద టీటీడీ చైర్మన్‌గా పనిచేసే అదృష్టం దక్కిందన్నారు.



క్లుప్తంగా

కలుషిత ఆహారం తిని 79మందికి అస్వస్థత



చికిత్సలందిస్తున్న వైద్య సిబ్బంది

కేవీబీపురం : మండలంలోని ఆరె పంచాయతీలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో కలుషిత ఆహారం తిని 79 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. అష్టమి వేడుకల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు పులిహోర, లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేశారు. వీటిని భుజించిన భక్తులకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. పరిస్థితి తీవ్రం కావడంతో స్థానిక పీహెచ్‌సీలో అడ్మిట్ అయ్యారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి మంగళవారం ఆరె గ్రామానికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి, కేవీబీపురం పీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. ఘటనపై తహసీల్దార్ శ్రీదేవి విచారణ చేపట్టారు. ఊరేగింపులో పంపిణీ చేసిన ప్రసాదాలు ఫుడ్‌పాయిజన్ కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వెల్లడించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకును ఆరునెలలుగా శుభ్రం చేయకపోవడంతో తాగునీరు సైతం కలుషితమైనట్లు స్థానికులు ఆరోపించారు. సర్పంచ్, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఎంహెచ్‌ఓ శ్రీహరిని వివరణ కోరగా ఘటనకు కల్తీ ఆహారమే కారణంగా భావిస్తున్నామని విచారించి పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. వారం రోజుల పాటు మెడికల్ క్యాంపును కొనసాగించాలని ఆదేశాలు జారీచేసినట్లు వెల్లడించారు.

ఇలవైకుంఠం..
తుమ్మలగుంట వైభవం

- ప్రారంభమైన కల్యాణ వెంకన్న సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- పెద్ద శేష, చిన్న శేష వాహనాలపై వైకుంఠనాథుని విహారం
- కంకణధారుడై వాహనసేవల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి



పెద్ద శేషవాహన సేవలో ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలకు తుమ్మలగుంట ముస్తాబైంది. ఎటుచూసినా పచ్చని తోరణాలు, దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతున్న దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు ఇలవైకుంఠం లా మెరిసిపోతోంది. సోమవారం నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాటు చేపట్టారు. మొదటి రోజైన సోమవారం రాత్రి పెద్ద శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి పరమపద వైకుంఠ నాథుడి అలంకరణలో భక్తులను కటాక్షించారు. రెండో రోజు మంగళవారం ఉదయం చిన్న శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు స్వయంగా పాల్గొనే మొదటి ఉత్సవం పెద్ద శేషవాహనం. ఆది శేషుడు ఏడుకొండలకు, ఏడు లోకాలకు సంకేతంగా ఏడు పడగలు కలిగిన అతి శక్తిమంతుడైనప్పటికీ శ్రీవారికి వాహనమై నిత్యం స్తుతిస్తూ, స్వామికి మంచం, పరుపు, ఛత్రం మూడూ అవడంతో శేషశాయి అని కూడా పిలుస్తారు. శ్రీవారి విశ్రాంతికీ, సుఖ నిద్రకూ కారణమవుతున్న శేషునిపై దర్శించే భక్తుల్ని స్వామి వారు కటాక్షిస్తారని ప్రతీతి. భక్తులు అందరూ ఆది శేషుని వలె స్వామికి నిత్య సేవకులుగా ఉంటే సత్ఫలితాలు పొందవచ్చని ఈ వాహనసేవ ద్వారా స్వామి వారు భక్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మితో పాటు ఆలయ ఈఓ సుబ్రమణ్యంరెడ్డి, ఆలయ కంకణ భట్టార్ గిరిధర్ భట్ట ఆచార్యులు, వేద పాఠశాల ప్రన్సిపల్ బ్రహ్మజీ శర్మ పాల్గొన్నారు.

శ్రీవారికి సారె సమర్పణ



ఉమ్మడి శెట్టిపల్లి ప్రజలతో ఎమ్మెల్యే చెవిరెడ్డి

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద శేష వాహనం సేవలో పాకాల మండలం మొగరాల, దామలచెరువు, గానుగపెంట, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీల ప్రజలు, చిన్న శేషవాహనం సేవకు తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి పద్మావతిపురం, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుంచి చీర, సారెను తీసుకు రావడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎదురెళ్లి వారికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులు తీసుకుని వచ్చిన సారెను స్వామి వారికి సమర్పించారు.



చిన్న శేషవాహనంపై కల్యాణ వెంకన్న

హంస వాహనంపై వీణానాథుడు



తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం రాత్రి అనంత తేజోమూర్తి అయిన శ్రీనివాసుడు సరస్వతీ దేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు.

కేరళ వాయిద్యాలు భళా

బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజున కేరళ వాయిద్యాలు, చెక్క భజనలు, పిల్లన గ్రోవి కళాకారుల కృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు సింహ, ముత్యపు పందిరి వాహనం

బ్రహ్మోత్సవాలలో మూడో రోజు బుధవారం ఉదయం 7 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహన సేవలపై స్వామి వారు విహరిస్తారు.

నెమలి పింఛం..గణనాథం!

– తుమ్మలగుంటలో అతిపెద్ద నెమలిపింఛం వినాయకుడు



నెమలి పింఛాల వినాయక విగ్రహాన్ని ప్రారంభించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డితో బాలవినాయక కమిటీ సభ్యులు

తిరుపతి రూరల్: రాష్ట్రంలోనే అతిపెద్ద నెమలి పింఛాల వినాయకుడు తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో కొలువుదీరాడు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వివిధ ఆకృతులతో వినాయక విగ్రహాలను తుమ్మలగుంటలో ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈనేపథ్యంలో దాదాపు 10 వేల నెమలి పింఛాలతో అతిపెద్ద వినాయక విగ్రహంతో పాటు 1,116 కిలోల లడ్డూను ప్రత్యేకంగా ఈ ఏడాది ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా సోమవారం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఈ విగ్రహాన్ని ప్రారంభించారు.

అద్భుతం

వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించడంలో తెలుగు రాష్ట్రాల్లోనే చెవిరెడ్డికి ప్రత్యేక స్థానం ఉందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. హైదరాబాద్, చెన్నైకి చెందిన 50 మంది సినీ సెట్టింగ్‌లు వేసే కళాకారులతో 25 రోజుల పాటు శ్రమించి 10 వేల నెమలి పింఛాలతో తీర్చిదిద్దిన వినాయక విగ్రహం అద్భుతమని ప్రశంసలు కురిపించారు.

యువతను సన్మార్గంలో నడిపించేందుకే..

యువతను సన్మార్గం వైపు నడిపించాలనే లక్ష్యంతోనే చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక సేవలను కొనసాగిస్తున్నట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు.

పోటెత్తిన భక్తులు

నెమలి పింఛం వినాయకుని దర్శనార్థం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో బాల వినాయక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వెంకటగిరి జాతర తొలి చాటింపు నేడు



తుదిమెరుగులు దిద్దుకున్న అమ్మవారి ముఖద్వారం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరకు బుధవారం అర్ధరాత్రి తొలి చాటింపు వేయనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో జాతర చాటింపు ప్రాధాన్యతను సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మతల్లి జాతర అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం వెంకటగిరి రాజా కుటుంబీకుల నుంచి అనుమతి తీసుకోనున్నారు. అదేరోజు అర్ధరాత్రి కాంపాళెంలోని గాలిగంగు దేస్థానం వద్ద ప్రత్యేక పూజలు, జాతర చాటింపు వేయనున్నారు. వెంకటగిరిలో తొలి చాటింపు వేసినప్పటి నుంచి జాతర ముగిసే వరకు వెంకటగిరి, పరిసర ప్రాంతాల్లో శుభకార్యాలు నిర్వహించరాదు. కాగా 27వ తేదీన రెండో చాటింపు, అక్టోబర్ 1న ఘటోత్సవం, 4న అమ్మవారి ఉత్సవం, 5న నిలుపు, నగరోత్సవం, నిష్క్రమణ జరగనుంది. అమ్మవారి జాతర నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు ఊపందుకున్నాయి.

మహిళా వర్సిటీలో నేడు ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బుధవారం వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వీసీ భారతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు నిధులతో ఏర్పాటైన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సిలర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం సోషల్ వర్క్, సైకాలజీలో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వర్సిటీలోని సోషల్ వర్క్ విభాగంలో మధ్యాహ్నం 2.00 గంటలకు అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

సీఎంకు స్వాగతం, వీడ్కోలు





సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





మంత్రి ఆర్కే.రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

రేణిగుంట: తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే.రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు మద్దెల గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణచక్రవర్తి, సిపాయి సుబ్రమణ్యం, భరత్, మేరుగ మురళి, చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్‌రావు, పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, జంగాలపల్లి శ్రీనివాసులు, వెంకటే గౌడ, కొరముట్ల శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తిరుపతి నగర కమిషనర్ హరిత తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంగళవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు.

టీడీపీకి భంగపాటు తప్పదు



వైఎస్సార్‌సీపీలో చేరిన శివయ్య, అతని అనుచరులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రాబోయే ఎన్నికల్లో టీడీపీకి భంగపాటు తప్పదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహేష్ కళ్యాణ్ సదన్ లో మంగళవరం సాయంత్రం శివయ్యయాదవ్ సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఏర్పేడు మండలానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, సదాశివ డ్యాం మాజీ చైర్మన్ మోహన్‌కృష్ణగౌడ్ కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతి నిజాయితీగా ఉండే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తప్పక భవిష్యత్తు ఉంటుందన్నారు. నిన్న ముత్యాల పార్థసారథి, నేడు శివకుమార్ యాదవ్, రేపు మరో మంచి నాయకుడు మన కుటుంబంలోకి రాబోతున్నారని తెలిపారు. పార్టీ చేరిన వారిలో గోపీయాదవ్, చెంచయ్య, మాధవ్‌యాదవ్, భానుయాదవ్, తరుణ్ యాదవ్, పవన్ యాదవ్, యోగయాదవ్, సాయి రెహమాన్, సల్మాన్ సారథి, మనోజ్ హుస్సేన్, రాజు, హరి, నాగరాజు, అఖిల్, రఫీ రియాజ్, విష్ణు, ధనుష్, శివ, రాకేష్, సందీప్, మునీర్, ఖాదర్, మీర్జా, చందు, శ్యామ్, పండు, ముని, ఇమ్రాన్, సురేంద్ర, సాయి, శ్రీను, తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. చివరగా రెహమాన్ అనే కార్యకర్త మృతికి సంతాపం తెలిపారు. గుమ్మడి బాలకష్ణయ్య, లోకేష్ యాదవ్, ముత్యాల పార్థసారథి, సిరాజ్ బాషా, గోరా, పఠాన్ ఫరీద్, కోవిచంద్రాయనాయుడు, జనార్ధన్ యాదవ్, డిష్ ధర్మయ్య, మున్నా, జైశ్యామ్, చింతామణి పాండు, ప్రమీలమ్మ, పుష్ప, రుశేంద్రమణి, ధనలక్ష్మి, మేకల జయరామయ్య పాల్గొన్నారు.